# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 174 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | శుక్రవారం -25 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు.. లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు




2035 నాటికి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ వెల్లడి

కోల్‌కతా సమీపంలో రూ. 4,000 కోట్లతో 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రికి శంకుస్థాపన

ఆసుపత్రిలో 50% పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం అందిస్తామని హామీ

## అభివృద్ధి ఒక మానవ హక్కు.. సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఐరాసలో భారత్




అభివృద్ధి హక్కుపై ఐరాసలో భారత్ కీలక ప్రకటన

సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి

అభివృద్ధి హక్కుపై కొత్త ఒప్పందానికి భారత్ పూర్తి మద్దతు




## విశాఖను ముంచెత్తిన భారీ వర్షం.. 24 సెం.మీ. వర్షపాతం

- కళింగపట్నం వద్ద తీరందాటిన వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో దంచికొడుతున్న వర్షాలు
- విశాఖలో ప్రధాన రహదారుల జలమయం

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది.

## భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు




- వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు ఏ అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదన్న చంద్రబాబు
- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశం
- ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్న సీఎం

అమరావతి: ఏపీలో తీవ్ర వాయుగుండం

# కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

### కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్

- వర్షాలు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- పిఠాపురం సుద్దగడ్డ వాగు, ఉప్పాడ తీర ప్రాంత పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా
- నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన



అమరావతి: తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు.గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మిగతా 2 లో




## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్

ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

## 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### డిసెంబరు 7-9 తేదీల్లో గ్లోబల్ సమిట్‌కు ప్రచారం




- గ్లోబల్ సమిట్‌పై అంతర్జాతీయ రోడ్‌షోలు
- సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశాం
- సమిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

హైదరాబాద్: డిసెంబరు 7-9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రచారం కోసం తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న దేశాల్లో అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగం నుంచి మిగతా 2 లో

## ఉపాధ్యాయులపై దాడి చేసిన వారితో జగన్.. మీరెవరి వైపు?

### టీచర్లపై దాడి చేసిన వారు జగన్‌తో ఉన్నారన్న లోకేశ్

- నిందితుల ఫొటోలను సోషల్ మీడియాలో విడుదల చేసిన మంత్రి
- పలువురు రౌడీషీటర్ల పేర్లు బహిర్గతం
- తాను టీచర్ల వైపు, జగన్ రౌడీల వైపు అని వ్యాఖ్య




అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రౌడీషీటర్లకు మధ్య సంబంధాలు ఉన్నాయంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన పలువురు రౌడీషీటర్లు జగన్‌తో కలిసి ఉన్న ఫొటోలను ఆయన మిగతా 2 లో




## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు

- వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ'.. ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!
- ప్రభుత్వ నిర్ణయానికి త్వరలో కేబినెట్ ఆమోదముద్ర
- ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి
- చరిత్ర ఉట్టిపడేలా కొత్త డిజైన్లు రూపొందించాలని ఆదేశం

# విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి

### రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలి

- పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారు
- సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయి
- రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలి
- యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలి




దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి తో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి మిగతా 2 లో

## పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు నీటిని తీసుకువెళ్తుంటే... రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు




- "ఆంధ్రాలో క్రాప్‌హాలిడే లేదు. తెలంగాణాలో మాత్రమే ఉంది
- ఎల్‌నినో వల్ల కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు
- కాంగ్రెస్ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు
- కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకొంటూ, కమీషన్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరింది
- శ్రీశైలంలో 96 టీఎంసీల నీరు ఉంది

## బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు..
# లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు

ఢిల్లీ: ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్‌లో 2,000 పడకల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హాజరయ్యారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌ను తూర్పు భారతదేశంలో తమ 'కర్మభూమి'గా అభివర్ణించారు. ఈ రాష్ట్రాన్ని కేవలం ఒక పెట్టుబడి కేంద్రంగానే కాకుండా, తాము సేవ చేయాలనుకుంటున్న, భాగం కావాలనుకుంటున్న ప్రదేశంగా చూస్తున్నామని అన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి, పంపిణీ, జాతీయ రహదారులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి కీలక రంగాల్లో ఈ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు వివరించారు. ఇక 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి ప్రాజెక్టు కోసం సుమారు రూ. 4,000 కోట్లు వెచ్చించనున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తుందని అదానీ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని మొత్తం 2,000 పడకల్లో 50 శాతం, అంటే 1,000 పడకలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం కేటాయిస్తామని, వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో ఒక మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## అభివృద్ధి ఒక మానవ హక్కు..
## సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఐరాసలో భారత్

ఢిల్లీ: అభివృద్ధి అనేది ప్రతి మనిషికి ఉన్న విడదీయరాని మానవ హక్కు అని, దాన్ని సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది. సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, బహుపాక్షిక సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ మేరకు 'అభివృద్ధి హక్కుపై ఒప్పందాన్ని' వీలైనంత త్వరగా ఆమోదించాలని భారత్ మద్దతు తెలిపింది. ఐరాస సర్వప్రతినిధి సభలో 'అభివృద్ధి హక్కు ప్రకటన' 40వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ దేశాలు) సిబి జార్జ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత జాతీయ ప్రకటనను వినిపిస్తూ, దేశం వైఖరిని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ధ్రువీకరించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. ఈ అభివృద్ధి హక్కు అనేది ప్రతి వ్యక్తి, ప్రజలందరూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి, తోడ్పడటానికి, ఆ ఫలాలను ఆస్వాదించడానికి అధికారం కల్పిస్తుంది. దీని ద్వారానే అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛలు పూర్తిగా సాకారం అవుతాయి. గత 40 ఏళ్లలో ఈ ప్రకటన స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో గణనీయమైన పురోగతి నమోదైంది. కోట్లాది మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ, ఈ అభివృద్ధిలో చాలా అసమానతలు ఉన్నాయని, పురోగతి అందరికీ సమానంగా చేరలేదని ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. అనేక దేశాలు తమ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను, నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో 40వ వార్షికోత్సవం ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, అందరికీ మరింత సమ్మిళిత, సమానమైన భవిష్యత్తును అందించడానికి ఒక ముఖ్యమైన అవకాశమని ఐరాస అభిప్రాయపడింది.

## భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు

అమరావతి: ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలను, ఇన్-ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పారు. వరద ముంపునకు గురైన బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మరియు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.

## విశాఖను ముంచెత్తిన భారీ వర్షం.. 24 సెం.మీ. వర్షపాతం

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వేకువజాము నుంచి పడుతున్న వర్షాలకు విశాఖపట్నం నగరం జలదిగ్బంధంలో చిక్కుకోగా, రికార్డు స్థాయిలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసరాల్లో 18 సెం.మీ, కాకినాడ, విజయనగరంలో 13 సెం.మీ, కళింగపట్నం, తునిల్లో 5 సెం.మీ మేర వర్షపాతం రికార్డయింది. విశాఖలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. డ్రైనేజీలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వాయుగుండం తీరం దాటినప్పటికీ భూభాగంపై ప్రభావం కొనసాగుతుండటంతో రాగల కొన్ని గంటల్లో ఉత్తరాంధ్రలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. జీవీఎంసీ, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపడుతుండగా, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు

హైదరాబాద్: వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

డిజైన్లపై సీఎం అసంతృప్తి

ఇదే సమీక్షలో విమానాశ్రయాల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికారులు చూపిన డిజైన్లను చూసి "ఇవి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) డిజైన్లా? లేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చేసినవా?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. విమానాశ్రయాల నిర్మాణం అద్భుతంగా, తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం సూచనల మేరకు అధికారులు ఇప్పుడు కొత్త డిజైన్లను సిద్ధం చేసే పనిలో పడ్డారు. త్వరలోనే తుది డిజైన్లను మళ్లీ సీఎంకు సమర్పించనున్నారు.

## ఉపాధ్యాయులపై దాడి చేసిన వారితో జగన్..
# మీరెవరి వైపు?: లోకేశ్



అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రౌడీషీటర్లకు మధ్య సంబంధాలు ఉన్నాయంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన పలువురు రౌడీషీటర్లు జగన్‌తో కలిసి ఉన్న ఫొటోలను ఆయన బుధవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో విడుదల చేశారు. వైసీపీ నిర్వహించిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియోలను కూడా ఆయన ఈ సందర్భంగా పంచుకున్నారు. పణుగంటి చైతన్య, ఎస్. సందీప్, ఆవుటు శ్రీనివాసరెడ్డి, బంకా అరుణ్ సహా పలువురి పేర్లను లోకేశ్ ప్రస్తావించారు. దాడికి పాల్పడిన వారు జగన్‌తో కలిసి ఉన్న చిత్రాలను ఆయన సాక్ష్యాలుగా పోస్ట్ చేశారు. జగన్ రౌడీషీటర్ల పక్షాన నిలవగా, తాను మాత్రం ఉపాధ్యాయులు, క్రీడాకారుల పక్షాన నిలబడ్డానని లోకేశ్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల వైపు ఉండాలో, రౌడీల వైపు ఉండాలో ప్రజలే తేల్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

అమరావతి: తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు.గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కళ్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించినట్లు కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతర దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిధిలోని సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున, ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన హెచ్చరికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంత వరకు యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అండగా నిలవాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## 2047 నాటికి తెలంగాణను
## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్: డిసెంబరు 7-9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రచారం కోసం తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న దేశాల్లో అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగం నుంచి పెట్టుబడులు రావడానికి అవకాశాలున్నాయో అధ్యయనం చేసి, దానికనుగుణంగా రోడ్‌షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సచివాలయంలో గ్లోబల్ సమిట్ సన్నాహక సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... "ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచస్థాయి సదస్సు ఇది. దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలి. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారు. సమిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. వార్‌రూం ద్వారా రోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేయాలి" అని సూచించారు. బతుకమ్మ పండగ ప్రాశస్త్యం, తెలంగాణ సంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు తెలియజేసేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడానికి ఇదొక అద్భుత అవకాశమని పేర్కొన్నారు.

## పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు
# నీటిని తీసుకువెళ్తుంటే...
## రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకొంటూ, కమీషన్ మేనేజ్‌మెంట్‌లో ఆరితేరిందని... వాటర్ మేనేజ్‌మెంట్‌లో విఫలమైందని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్‌నినో వల్ల కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన హరీశ్‌రావు భారాస జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. "ఆంధ్రాలో క్రాప్‌హాలిడే లేదు. తెలంగాణలో మాత్రమే ఉంది. శ్రీశైలంలో 96 టీఎంసీల నీరు ఉంది. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో రోజుకు 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశం ఉన్నా.. 3 మోటార్లతో రోజుకు 8 గంటలే నడుపుతున్నారు. దీంతో 800 క్యూసెక్కుల నీరు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది. పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు 800 కి.మీ. దూరాన ఉన్న కుప్పానికి నీటిని తీసుకువెళ్తుంటే... రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను ఎండబెడుతున్నారు. 365 రోజులూ దేవాదుల మోటార్లు నడిపేలా భారాస ప్రభుత్వం సమ్మక్క బ్యారేజీని కట్టింది. అక్కడా రోజుకు 8 గంటలే నీటిని ఎత్తిపోస్తున్నారు.

నల్గొండను ముంచింది ఉత్తమ్‌కుమారే..

నల్గొండను ముంచి ఆంధ్రాకు మూడో పంట కోసం పులిచింతల కట్టింది ఉత్తమ్‌కుమార్‌రెడ్డే. కృష్ణా నీటిలో 34 శాతం వాటా వినియోగించుకునే అవకాశం ఉన్నా పూర్తిస్థాయిలో వాడుకోవడం లేదు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు క్రాప్ హాలిడే ఎందుకు ఇచ్చారు? నల్గొండ, ఖమ్మం, పాలమూరు జిల్లాలకు అన్యాయం చేస్తున్నారు. ఏడాదికి 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిస్తామని అసెంబ్లీలో చెప్పి...ఇప్పటికి 2 లక్షల ఎకరాలకైనా ఇచ్చారా? పాలమూరు ఎత్తిపోతల పథకంలో భారాస ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చుచేసి నార్లాపూర్, ఏదుల, కర్వెన, వట్టెం రిజర్వాయర్లను కట్టింది. ప్యాకేజీ-3లో సున్నపుతండా నుంచి తెల్లరాళ్లపల్లి వరకు ఉండే కాలువలో మిగిలిన 33 లక్షల క్యూబిక్ మీటర్ల పనిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయలేదు. దీంతో రిజర్వాయర్లలో నీటిని నింపే పరిస్థితి లేకపోయింది" అని హరీశ్‌రావు వివరించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి తో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. సింగరేణిలో జీ 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు. జీ- 9 గ్రేడ్ బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతపై ఆధారపడిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎలా నిర్మించారని ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎం గారు అధికారులను ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారని అడిగారు. ఈ కేంద్రానికి బొగ్గు సరఫరా చేయడం వల్ల రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించారు. అప్పట్లో రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం దూరంగా నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని చెప్పారు. సింగరేణి నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయలేదని అధికారులు వివరణ ఇచ్చారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పంపులకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. అన్ని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు గారితో పాటు ఇంధన శాఖ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సింగరేణి కాలరీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు.

దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్ (SAP)తో భేటీ

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (SAP) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (MSME) డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు SAP నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ఫ్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: అబాట్‌కు ఆహ్వానం

అమెరికాకు చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, ఫార్మా సంస్థ అబాట్ ఇండియా ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని మెడ్‌టెక్ జోన్ (AMTZ) లేదా ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (EMC)లో వైద్య పరికరాలు లేదా డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని, విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై అంజాద్ స్పందిస్తూ, భారత్‌లో తమకు గోవా, గుజరాత్‌లలో తయారీ కేంద్రాలున్నాయని, స్థానిక ఫార్మా సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

ఏపీలో ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయండి: సిస్కోతో లోకేశ్ భేటీ

గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

వివో కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయండి

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌తోనూ లోకేశ్ సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా ఎదుగుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వివో సరఫరాదారుల కోసం ప్రత్యేకంగా ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్' అభివృద్ధి చేయాలని, దీనికోసం ప్రభుత్వంతో కలిసి 'సప్లై చైన్ సమావేశం' నిర్వహించాలని సూచించారు. అర్జిత్ సేన్ స్పందిస్తూ, దేశంలో విక్రయించే ఫోన్లలో 99% పైగా గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం మీద, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయడమే లక్ష్యంగా సాగింది. పలు దిగ్గజ సంస్థల నుంచి సానుకూల స్పందన రావడంతో, భవిష్యత్తులో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## జర్నలిస్టులు నిరంతరం విద్యార్థులుగా ఉంటూ కొత్త విషయాలను నేర్చుకోవాలి: కె. చెన్న కేశవ రావు



ఎచ్చెర్ల, మహి న్యూస్, సెప్టెంబరు 24: జర్నలిజంలో ఎప్పటికప్పుడు అనేక మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ, జర్నలిజానికి ఉన్న ప్రత్యేకత ఎప్పటికీ అలాగే ఉంటుందని శ్రీకాకుళం జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్వో) కె. చెన్న కేశవ రావు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో జర్నలిస్టులు, గ్రామీణ విలేకరుల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జర్నలిజం తొలినాళ్లలో రేడియో ద్వారా, ఆ తర్వాత పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు సమాచారం చేరిందని, ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు కూడా వార్తా ప్రసారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెన్న కేశవ రావు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ జర్నలిజంలో కొత్త విధానాలు, కొత్త సవాళ్లు వస్తున్నాయని చెప్పారు. అయితే మాధ్యమాలు, సాంకేతికత మారినా ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం వంటి జర్నలిజం ప్రాథమిక లక్షణాలు మారవని పేర్కొన్నారు. జర్నలిస్టులు నిరంతరం ఒక విద్యార్థిలా ఉంటూ కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, కొత్త మీడియా విధానాలు, సామాజిక మాధ్యమాల వినియోగం, వార్తా సేకరణలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రతి రోజు కొత్త విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడం ద్వారా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. వార్తలను సేకరించే సమయంలో వాస్తవాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించి, నిర్ధారించుకున్న సమాచారాన్నే ప్రజలకు అందించాలని సూచించారు. వేగంగా వార్తలను అందించడంతో పాటు వార్తల కచ్చితత్వం, విశ్వసనీయత, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్న సమాచారాన్ని పరిశీలించి, నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తగా ప్రచురించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా జర్నలిస్టులు, గ్రామీణ విలేకరులకు ఆధునిక జర్నలిజం విధానాలు, మారుతున్న మీడియా పరిణామాలపై అవగాహన కల్పించేందుకు అవకాశం లభించిందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. అనురాధ, యూబీఏ సమన్వయకర్త, పీఎం-ఉషా నోడల్ అధికారి డాక్టర్ యు. కావ్య జ్యోత్స్న, సీనియర్ జర్నలిస్ట్ డి. రాజేంద్ర ప్రసాద్, జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్. రెడ్డి తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృతంగా పర్యటన



టెక్కలి, మహి న్యూస్, సెప్టెంబర్ 24: టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన చేశారు. టెక్కలి మండలం పరిధిలోని మెలియాపుట్టి రహదారిని పరిశీలించారు. అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విస్తృతంగా పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులను స్వయంగా పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల అధికారులతో పరిస్థితిపై సమీక్షించి, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు నూతన రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రహదారులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులకు సూచించారు. నందిగాం మండలం కొత్త అగ్రహారం వద్ద తుఫాన్ ప్రభావంతో కూలిపోయిన వంతెనను మంత్రి పరిశీలించారు. వంతెన పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. వర్షాలతో వ్యవసాయ పొలాల్లో చేరిన నీటిని కూడా మంత్రి పరిశీలించారు. పంట పొలాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ముంపు నాకు గురైన ప్రాంతాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా కాలువలు, నీటి మార్గాలను సరిచేయాలని అధికారులకు సూచించారు. రైతులకు నష్టం కలగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ శేషగిరిరావు, తదితరులు, పాల్గొన్నారు,

## వీరేశ్వర స్వామికి ఘనంగా త్రయోదశి ప్రత్యేక పూజలు

### నందీశ్వరస్వామికి అభిషేకాలు.. భక్తిశ్రద్ధలతో పూజలు.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 24: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో కొలువై ఉన్న పురాతన శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, స్వామివారికి శాస్త్రోక్తంగా వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకంఠ భీమేశ్వర శర్మ బ్రహ్మత్వంలో కనకాల హరిబాబు--జ్యోతి, తడాల సత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో నందీశ్వరస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పలు పవిత్ర ద్రవ్యాలతో నందీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి, అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. త్రయోదశి రోజున నందీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటే స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. దీంతో సుంకరపాలెం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రతి నెల త్రయోదశి రోజున దాతల సహకారంతో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, దాతలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కనకాలపేటలో ఘనంగా వినాయక నిమజ్జనం

### రూ.50 వేలకు 108 కేజీల మహా లడ్డూ ప్రసాదం.



యానం, మహి న్యూస్, సెప్టెంబర్ 24: యానాం శివారు కనకాలపేట గణపతి నగర్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో 17వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన 108 కేజీల మహా లడ్డూ ప్రసాదాన్ని నిర్వహించిన వేలం పాటలో రూ.50 వేలుకు భక్తులు దక్కించుకున్నారు. వేలం పాటలో దూళ్ల రామకృష్ణ, కవల తిరుమలరావు (బాబులు), కవల వీరభద్రరావు, గొర్రెల రాజేష్ పాల్గొని రూ.50 వేలుకు మహా లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. అదేవిధంగా మరో లడ్డూను స్థానిక నాయకులు కవల కోటేశ్వరరావు రూ.11 వేలుకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్థలదాత, ధర్మకర్త కవల గణపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు లడ్డూ ప్రసాదాలను దక్కించుకున్న భక్తులను అభినందించారు. అనంతరం గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. స్వామివారిని పురవీధుల్లో భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లి కనకాలపేట గోదావరిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తుల కోలాహలం, మేళతాళాల నడుమ వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా సాగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### -పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్

**పరిగిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 11 రోజులపాటు నిత్యం పూజలు అందుకున్న గణనాథులను లక్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ తెలిపారు**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: లక్నాపూర్ ప్రాజెక్టులో వినాయకుల నిమజ్జనం చేసేందుకు శాంతి భద్రతల మధ్యన కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసినట్లు పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ తెలిపారు, పరిగి నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాలలో నిత్యం పూజలు అందుకున్న గణనాథులను లక్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేసేందుకు భక్తులు ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో వినాయకుల నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. లక్నాపూర్ ప్రాజెక్టు దగ్గర వినాయకుల నిమజ్జనం సందర్భంగా ట్రైన్లు ఏర్పాటు చేసి సంబంధిత సిబ్బంది లైట్లు అదేవిధంగా పరిగి మున్సిపల్ కేంద్రం నుంచి లక్నాపూర్ ప్రాజెక్ట్ వరకు రోడ్డు పొడవున భక్తులకు వినాయకులను తరలించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పరిగి కేంద్రం నుంచి లక్నాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్లను సైతం నరికివేసి గణేషులకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా కృషి చేసినట్లు పేర్కొన్నారు రోడ్డ పనులు జరుగుతున్న నేపథ్యంలో వర్షం పడుతున్న తరుణంలో బురద జరిగే అవకాశం ఉంది కనుక మొరం సైతం వేయించి వాహనాలు ఎక్కడ కూడా కిందికి కుంగిపోకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు సంబంధిత శాఖల అధికారులు సైతం వినాయక నిమజ్జనం శాంతిభద్రతల మధ్యన సవ్యంగా జరిగేందుకు సంబంధిత అధికారులు సైతం వినాయకులు లక్నాపూర్ ప్రాజెక్టుకు తరలిస్తున్న సమయంలో ఎక్కడికక్కడ వెంబడి ఉండి ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సంబంధిత నాయకులు తదితరులు పాల్గొంటున్నారు. కావున నిత్యం వినాయక మంట పాల దగ్గర పూజలు అందుకున్న గణనాథులను లక్మాపూర్ ప్రాజెక్టుకు నిమజ్జనం గురించి తరలిస్తున్న సమయంలో ఆయా వినాయక మండపాల కమిటీ సభ్యులు భజన భక్తులు వినాయకుడిని మండపం నుంచి తరలించింది మొదలు వినాయక నిమజ్జనం చేసి తిరిగి ఇంటికి వచ్చేవరకు మండపం కమిటీ సభ్యులు దగ్గరుండి చూసుకోవాలని మండపాల కమిటీ సభ్యులకు మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని వినాయక మండపాల కమిటీ సభ్యులే కాకుండా మండల పరిధిలోని గ్రామాలలో సైతం వినాయక మండపాల నుంచి లక్నాపూర్ ప్రాజెక్టు వరకు వినాయకులను తరలిస్తున్న సమయంలో కమిటీ సభ్యులు దగ్గరుండి నిమజ్జనం సవ్యంగా జరిగేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు అప్పుడే వినాయక నిమజ్జనం ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతుందని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు.

### నిమజ్జన సమయంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది:-పరిగి ఎస్సై మోహనకృష్ణ

వినాయక ఉత్సవాలలో భాగంగా లక్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేయించుటకు వినాయకులను తరలిస్తున్న సమయంలో మండపాల నుంచి వినాయకుడు లక్నాపూర్ ప్రాజెక్టుల నిమజ్జనం జరిగే వరకు ఆ మండపం దగ్గరన ఉన్న సిబ్బంది వినాయకుడికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందజేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు వినాయకుడిని సవ్యంగా నిమజ్జనం చేసేందుకు అందరు కృషి చేయాలని పేర్కొన్నారు. పోలీసులు పరిగి నుంచి లక్నాపూర్ ప్రాజెక్ట్ వరకు దగ్గరుండి వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొంటూ వినాయక భక్తులకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిమజ్జనం సవ్యంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ముందుకు వచ్చి తమ తమ సహాయ సహకారాలు అందించాలని ఎస్సై మోహన్ కృష్ణ పిలుపునిచ్చారు.

# ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ .. పకడ్బందీగా చేపట్టాలి

### -జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా లో నాలుగు నియోజకవర్గాల అధికారులతో సమీక్షించిన ఎన్నికల అబ్జర్వర్ ఇళంబర్తి, ఐఏఎస్. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఓటర్ల జాబితా సవరణ అబ్జర్వర్ ఇళంబర్తి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ నోటీసుల పురోగతిపై అబ్జర్వర్ ఇళంబర్తి, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,తహసీల్దార్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయింది, ఎంత



మంది ఓటర్లు ఉన్నారు,ఎన్యూమరేషన్ నోటీసులు ఎంత మందికి జారీ చేశారు,పెండింగ్‌లో ఉన్న అంశాలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, సరైన విధంగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ నోటీసులను అర్హులైన ఓటర్లకు నిర్ణీత విధానంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని, నోటీసుల జారీ అనంతరం సంబంధిత వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు



సూచించారు. ఎక్కడైనా సందేహాలు, అభ్యంతరాలు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, ప్రతి దశలోనూ పారదర్శకతను పాటించాలని అబ్జర్వర్ ఆదేశించారు.

అనంతరం మున్సిపల్ పరిధిలో

అలంపల్లి ప్రాంతంలో ఉన్న పీఎస్ నెంబర్ 169,170,ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మోతి నగర్ కాలనీలో గల బాలికల ప్రాథమిక పాఠశాలలో పీఎస్ నెంబర్,150,151,152,లో సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి, ఓటర్ల జాబితాకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2022 సంవత్సరం ఓటర్ల జాబితాలో తమ పేర్లు స్పష్టంగా ఉన్నవి , ప్రస్తుతం ఎస్ ఐ ఆర్ లో పేర్లు కనిపించడం లేదని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వయస్సు, పుట్టిన తేదీ తదితర సమస్యలు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలను పరిశీలించి, అవసరమైన పత్రాలను సేకరించి సమర్పిస్తున్నామని అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలు జాబితాలో సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ నోటీసుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు,డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర, తాండూర్ అనిత,తహసీల్దార్ లు, ఎం పి డి ఓ లు, మున్సిపల్ కమిషనర్ లు,ఎన్నికల విభాగం అధికారి నెమత్ హాలీ , బూత్ స్థాయి అధికారులు, సంబంధించిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీరం దాటిన తుపాను.. శాంతించిన వర్షాలు

### ఈదురుగాలుల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 24: తీరం దాటిన తుపాను ప్రభావం వల్ల ఏర్పడిన విపత్కర పరిస్థితులను జిల్లా యంత్రాంగం సమర్థంగా ఎదుర్కొందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తుపాను కళింగపట్నం వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీరం దాటిందని, ప్రస్తుతం జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. జిల్లాలో ఈ నెల 22న 42 మి.మీ, 23న 87.3 మి.మీ, 24న 98.99 మి.మీ చొప్పున సగటు వర్షపాతం నమోదైందని వివరించారు. నదులకు వరద ముప్పు -- పునరావాస కేంద్రాలు ఏర్పాటు: పొరుగు రాష్ట్రమైన ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగావళి, వంశధార నదులకు భారీగా వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్తగా జిల్లా వ్యాప్తంగా 86 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం అందులో 221 మంది ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 83 ఇళ్లు దెబ్బతిన్నాయని, 152 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని




కలెక్టర్ తెలిపారు. చెట్లు కూలిపోయిన ప్రాంతాల్లో నాలుగు గంటల్లోనే రోడ్లను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించినట్లు చెప్పారు. అంపోలులోని 33 కేవీ సబ్‌స్టేషన్‌ను పునరుద్ధరించడానికి 8 గంటల సమయం పట్టిందని, ప్రస్తుతం 11 కేవీ లైన్లు పనిచేస్తున్నాయని, జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఈ నెలలో ప్రసవ తేదీలు ఉన్న 42 మంది గర్భిణులను ముందుగానే గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించినట్లు పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉన్నాం -- సహాయక చర్యలు ముమ్మరం: ప్రస్తుతం బహుదా నదిలోకి 23,000 క్యూసెక్కుల నీరు వస్తోందని, అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. నాగావళికి 25,000 క్యూసెక్కుల నీరు రాబోతోందని.. ప్రమాద హెచ్చరిక స్థాయి 45,000 క్యూసెక్కులు అయినప్పటికీ ముందుగానే యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. జిల్లాలో రెండు చెరువులకు గండి పడినప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. సహాయక చర్యల కోసం రెండు ఎస్‌డీఆర్ఎఫ్, ఒక ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, అకస్మాత్తుగా వచ్చే వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) పట్ల అత్యంత అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలి: శుక్రవారం సాయంత్రం వరకు ఈ ఈదురుగాలుల తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నిరంతరం పనిచేస్తుందన్నారు. పాఠశాలల పరిసరాలు, అక్కడికి వెళ్లే రహదారులు సురక్షితంగా ఉంటేనే శుక్రవారం పాఠశాలలను పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారని, అధికారులంతా సమర్థంగా విధులు నిర్వహించారని కొనియాడారు. తుపాను ప్రభావంతో ఇప్పటివరకు 630 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన నష్టాలను అధికారులు క్షేత్ర స్థాయిలో అంచనా వేస్తున్నారని చెప్పారు. వంశధార ఇంజనీరింగ్ అధికారుల సమర్థవంతమైన కృషి వల్ల ఫ్లడ్ ఫ్లో కెనాల్, క్యాచ్‌మెంట్ ద్వారా హీరమండలం రిజర్వాయర్‌లో 1 టీఎంసీ నీటిని నిల్వ చేయగలిగామన్నారు. వర్షాలు పడ్డాయని మళ్లీ వరి పైరు జోలికి వెళ్లకుండా, రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కనకాలపేటలో ఘనంగా బాలగణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు

### రూ.16,500లకు లడ్డూ ప్రసాదం వేలం.





యానం, మహి న్యూస్, సెప్టెంబర్ 24: యానాం శివారు కనకాలపేటలోని ఏటిగట్టు వద్ద ఏర్పాటు చేసిన మండపంలో నిర్వహించిన బాలగణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో పోలాబత్తుల రాంబాబు, మణికంఠ కలిసి రూ.16,500లకు లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. నవరాత్రి ఉత్సవాల చివరి రోజు ఆలయం వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు బాలగణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపం పరిసర ప్రాంతం భక్తుల రాకతో ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు భక్తులకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్లు

**బళ్లారి రోడ్డులో పంపిణీ కార్యక్రమం**

**కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**హాజరైన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు**




అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎం.వై.ఆర్ ఫంక్షన్ హాల్‌లో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి, ఏపీ వికలాంగుల అధ్యక్షుడు హరినాథరెడ్డి, సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చనతో పాటు విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ కాంక్లేవ్‌లో వర్చువల్‌గా పాల్గొన్న

**- మంత్రి పయ్యావుల కేశవ్**

**రాష్ట్రాల ఆర్థిక పురోగతిపై చర్చ**

**దేశ ఆర్థికాభివృద్ధి, బ్యాంకింగ్ రంగ సవాళ్లపై చర్చ**

**రాష్ట్రాల ఆర్థిక పురోగతికి అవసరమైన వ్యూహాలపై చర్చల్లో పాల్గొన్న మంత్రి**







అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): ముంబైలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 13వ బ్యాంకింగ్, ఆర్థిక సదస్సులో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అమరావతి నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. గురువారం నిర్వహించిన ఈ సదస్సులో జూమ్ వేదికగా జరిగిన చర్చల్లో మంత్రి పాల్గొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి, బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రాష్ట్రాల ఆర్థిక పురోగతికి అవసరమైన వ్యూహాలు తదితర అంశాలపై సదస్సులో చర్చించారు.

# చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలి**

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు**

**ఉండవల్లి గాంధీబాబు, చల్లా మధుసూదన్‌రావు**



అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): చిన్నారులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, చల్లా మధుసూదన్‌రావు వైద్య అధికారులకు సూచించారు. గురువారం అనంతపురం పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులను వారు సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.. పసికందు నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి చిన్నారికి మానవతా దృక్పథంతో, ఆప్యాయంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో లేని వైద్యం అవసరమైన రోగులను సంబంధిత ఉన్నత వైద్యసేవలు అందించే ఆసుపత్రులకు సకాలంలో పంపించాలని తెలిపారు. అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సాయం అందేలా తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని వైద్యులకు సూచించారు. ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వైద్యుడిని పేద ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని వారు పేర్కొన్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చిన్నపిల్లల వార్డులోని ప్రతి బెడ్ వద్దకు వెళ్లిన కమిషన్ సభ్యులు.. చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారు ఎక్కడి నుంచి వచ్చారు, ఏ సమస్యతో ఆసుపత్రికి వచ్చారు, వైద్యం సక్రమంగా అందుతోందా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది చిన్నారులు బలహీనంగా ఉండటాన్ని గుర్తించిన వారు.. వారికి పోషకాహారం అందిస్తూ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాజిదా బేగం, ఉరవకొండ శిశు అభివృద్ధి పథకం అధికారి శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ట్రెల్లిస్ స్కూల్‌ను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ సభ్యులు

**చిన్నారుల భద్రతలో నిర్లక్ష్యం సహించేది లేదు**

**పాఠశాలలో భద్రతా చర్యలపై సమగ్ర తనిఖీలు**




అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): అనంతపురం పట్టణంలోని ట్రెల్లిస్ స్కూల్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్‌రావు, ఉండవల్లి గాంధీబాబు గురువారం సందర్శించారు. ఇటీవల పాఠశాలలో ఓ చిన్నారిపై జరిగిన లైంగిక దాడి ఘటనను కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించిన నేపథ్యంలో పాఠశాలను నేరుగా సందర్శించి సమగ్రంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భద్రతా ప్రమాణాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు.. ఘటన జరిగిన వెంటనే పోలీసులకు ఎందుకు సమాచారం అందించలేదని పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. చిన్నారుల రక్షణ కోసం పాఠశాలలో బాలల రక్షణ విధానం అమల్లో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగించాలని, విద్యార్థులకు సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల రక్షణకు అవసరమైన అన్ని కఠిన చర్యలు తక్షణమే చేపట్టాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. విచారణలో భాగంగా కమిషన్ సభ్యులు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులతో ఎలా వ్యవహరిస్తున్నారు, నాణ్యమైన విద్యాబోధన అందుతున్నదా, పాఠశాలలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా, తాగునీరు, ప్రవహించే నీటి సౌకర్యం అందుబాటులో ఉందా వంటి అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో మండల విద్యాశాఖ అధికారి వెంకటస్వామి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాజిదా బేగం, ఉరవకొండ శిశు అభివృద్ధి పథకం అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.





# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

**జిల్లాలో 70 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్ల ఉచిత పంపిణీ**

**ఒక్కో వాహనం విలువ రూ.1.20 లక్షలు**

**దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ**

**యూడీఐడీ కార్డుతో సంక్షేమ పథకాలు పొందే అవకాశం**

**జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి**

అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 70 మంది దివ్యాంగులకు



ఒక్కొక్కటి రూ.1.20 లక్షల విలువైన మూడు చక్రాల స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎం.వై.ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ,




ఆంధ్రప్రదేశ్ వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల కోసం పింఛన్లు, వైద్య సహాయం, ఆర్థిక ప్రయోజనాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పింఛన్ పొందుతున్న దివ్యాంగుల్లో ఇప్పటివరకు సుమారు 70 శాతం మందికి యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియ పూర్తయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, రాయితీలు పొందేందుకు యూడీఐడీ కార్డు కీలక ఆధారంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ సేవలు అందేలా ప్రజాప్రతినిధులు, దివ్యాంగుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు యూడీఐడీ కార్డుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

## మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక

రాబోయే రోజుల్లో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక మండలాన్ని ప్రయోగాత్మక ప్రాజెక్టుగా ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆ మండలంలో దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో అందించడంతో పాటు జీవనోపాధి, ప్రయాణం, మౌలిక వసతులు, ప్రత్యేక అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. సమాజంలోని ప్రతి దివ్యాంగుడికి సంక్షేమ ఫలాలు చేరేలా అందరూ సహకరించాలని కోరారు.




## దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచడంతో పాటు డయాలసిస్ బాధితులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేల వరకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ పాసుల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు



పేర్కొన్నారు. 45 ఏళ్లలోపు దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు అర్హత నిబంధనల్లో సడలింపులతో సబ్సిడీ రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక కళాశాలను డిగ్రీ కళాశాలగా మార్చే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో అనంతపురం జిల్లాను దివ్యాంగుల సంక్షేమంలో ఆదర్శంగా నిలిపేందుకు అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని నారాయణస్వామి తెలిపారు. అనంతరం 70 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, చైర్మన్ గడుపూటి నారాయణస్వామి పంపిణీ చేశారు. వాహనాలు అందుకున్న దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు వసంత్ కుమార్, సహాయ కార్యదర్శి రాజేష్, సక్ష్యం సేవా సంస్థ కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల రక్షణ మనందరి బాధ్యత

**పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**చైల్డ్ ప్రొటెక్షన్ పాలసీపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలి**

**పాఠశాలల్లో మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించాలి**

**బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలి**

**బాలికల రక్షణ విషయంలో రాజీ ప్రసక్తే లేదు**




అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): పిల్లల రక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, చిన్నారులపై ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వివిధ శాఖల అధికారులతో పిల్లల రక్షణ, బాలల హక్కుల అమలుపై సమీక్ష నిర్వహించారు. పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ సభ్యులు స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల యాజమాన్యం, అధికారులు బాలల రక్షణ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని తెలిపారు. అధికారులు పాఠశాలలను తనిఖీ చేసే సమయంలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, పరిశుభ్రత, నిరంతర నీటి సదుపాయం, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పరీక్షల్లో విఫలమైన కొందరు విద్యార్థులు తీవ్ర నిర్ణయాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు వారికి మనోధైర్యం కల్పించాలని కమిషన్ సభ్యులు సూచించారు. ప్రతి విద్యార్థి విజయానికి ఓటమి తొలి మెట్టుగా భావించి ముందుకు సాగేలా ప్రోత్సహించాలని తెలిపారు.

## క్షేత్రస్థాయిలో పరిశీలన

రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రైవేటు పాఠశాలలను కమిషన్ సభ్యులు పరిశీలించారు. బాలల హక్కుల అమలు, రక్షణ, మౌలిక వసతులు, పిల్లల అభివృద్ధికి సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలల సందర్శన సమయంలో విద్యార్థుల పేర్లు నమోదు చేయకుండా ప్రత్యేక పత్రాల ద్వారా వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నామని చెప్పారు. ఈ స్పందన ఆధారంగా పిల్లలకు అవసరమైన రక్షణ, సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలల్లో జరిగిన సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కమిషన్ సభ్యులు ఆదేశించారు. బాలికలు చదువుపై దృష్టి సారించి, తొందరపాటు నిర్ణయాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. చట్ట ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత






అధికారులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కమిషన్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాజిదా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించాలి

**అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించాలి**

**తక్కువ బరువు, ఎదుగుదల లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ**

**అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు**

అనంతపురం, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్ల మధుసూదనరావు, ఉండవల్లి గాంధీ బాబు సూచించారు. గుడ్లు, పాలు తదితర పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా అనంతపురం పట్టణంలోని కృపానందనగర్-2 అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం




అందిస్తున్న పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలు, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులు అంగన్వాడీ కేంద్రంలోనే పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను క్రమం తప్పకుండా అందిస్తూ, వారికి పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. బాలామృతం, గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె నాణ్యతను పరిశీలించారు. ఈ పౌష్టికాహారం చిన్నారులతో పాటు గర్భిణులు, మహిళలు, బాలింతలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని హాజరు పట్టిక, ఇతర రిజిస్టర్లను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.





చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారితో ముచ్చటించారు. పిల్లల్లోని అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాజిదా బేగం, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## ఆధునిక సాంకేతికతతో చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలి

**బయోఫ్లాక్, ఆర్ఏఎస్ విధానాలతో చేపల పెంపకానికి ప్రోత్సాహం**

**నిరుద్యోగ యువత, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి**

**ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి**

**అన్ని నియోజకవర్గాల నుంచి లబ్ధిదారుల ఎంపికకు కలెక్టర్ ఆదేశం**




నరసరావుపేట, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): బయోఫ్లాక్, ఆర్ఏఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చేపల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువత, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీడియా సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. గత ఏడాది కేటాయించిన రూ.50 లక్షల బడ్జెట్‌కు సంబంధించి రెండు బయోఫ్లాక్ చెరువులు, మంచు పెట్టెతో కూడిన రెండు మోటార్ సైకిళ్ల పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద జిల్లాకు నిర్దేశించిన ఆర్థిక లక్ష్యాలను నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. చేపల రంగం అభివృద్ధికి అవసరమైన శీతల గిడ్డంగులు, మంచు తయారీ కేంద్రాలు, ఆక్సిజన్ సిలిండర్లు, సింటెక్స్ పెట్టెలు, చేపల విక్రయ కేంద్రాల నిర్మాణం, చేపల రవాణా కోసం మూడు చక్రాల ప్రత్యేక వాహనాలు, జలాశయాల్లో చేప పిల్లల పెంపకం, చేపల విక్రయ చిన్న కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖాధికారి పి. ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, పల్నాడు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె. రామ్ ప్రసాద్, ఎన్ఎస్‌పీ ఈఈ ఈ. శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ, కృషి విజ్ఞాన కేంద్రం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నాదెండ్లలో ఘనంగా జాతీయ పోషణ మాసం

**జాతీయ పోషణ మాసం, స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమాల్లో పాల్గొన్న**

**జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**

**గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**

**అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారం అందించాలి**

**ప్రజల్లో పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన పెంచాలి**





నరసరావుపేట, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం, పౌష్టికాహార లోపం నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. నాదెండ్లలో నిర్వహించిన జాతీయ పోషణ మాసం, స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ నాయకురాలు నాగమల్లేశ్వరి, హెచ్‌డీఎస్ ప్రసన్న కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి నాణ్యమైన పోషకాహారం, అవసరమైన వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన పెంపొందించడమే జాతీయ పోషణ మాసం, స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.





## ఆర్అండ్ఆర్ సర్వే పూర్తి చేయాలి

**శనివారం నాటికి సర్వే పూర్తి చేసి ప్రచురణకు వెళ్లాలి**

**రికార్డుల ఆధారాలు పక్కాగా ఉండేలా చర్యలు**

**సబ్ డివిజన్ ప్రక్రియ గురువారం నాటికి పూర్తి చేయాలి**

**భూ సమీకరణలో ప్రతి వారం పురోగతి కనిపించాలి: కలెక్టర్**




గుంటూరు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): పునరావాసం, పునరావాస సర్వే (ఆర్అండ్ఆర్) ప్రక్రియను శనివారం నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సీఆర్‌డీఏ భూ సమీకరణ, ఇతర పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ సర్వేను పూర్తి చేసి ప్రచురణకు వెళ్లాలని సూచించారు. సర్వేకు సంబంధించిన రికార్డు ఆధారాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ ప్రక్రియను వచ్చే గురువారం నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్వేకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ వారంలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమీకరణ ప్రక్రియలో ప్రతి వారం స్పష్టమైన పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఏ. భార్గవ్ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి**

**అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలి**

**పాముకాటుకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ స్నేక్ వీనం అందుబాటులో**

**వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి: డీఎంహెచ్ఓ డా. చుక్క రత్న మన్మోహన్**



నరసరావుపేట, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): తుఫాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాలు, వరదలు, ముంపు పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. చుక్క రత్న మన్మోహన్ సూచించారు. ముంపు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాల్లో నివసిస్తున్న చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు ఏర్పాటు చేసే సహాయక శిబిరాలకు వెళ్లి, అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. భారీ వర్షాలు, తుఫాను సమయంలో ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, చెరువులు, కాలువలు, వాగులు, వరద నీటికి దూరంగా ఉండాలని తెలిపారు. వరద నీటిలో నడవడం, వాహనాలతో ప్రయాణించడం చేయరాదని హెచ్చరించారు. వర్షాలు, వరదలు లేదా ముంపు కారణంగా అనారోగ్యానికి గురైన వారు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం లేదా గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వర్షాకాలంలో పాముకాట్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ సూచించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు నివారణకు అవసరమైన యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పాముకాటు సంభవించిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా బాధితుడిని సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా జిల్లా యంత్రాంగం, ఆరోగ్య శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని డా. చుక్క రత్న మన్మోహన్ కోరారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి అవసరం

**గ్రామ, వార్డు స్థాయి నుంచి బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి**

**బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు**

**బాలల ఆరోగ్యం, విద్య, భద్రత, పోషణపై నిరంతర పర్యవేక్షణ అవసరం**

**పాఠశాలలు, అంగన్‌వాడీలు, సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలి**




గుంటూరు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): బాలలకు అవసరమైన అన్ని సదుపాయాలు, రక్షణ కల్పించడం ప్రతి శాఖ బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ ఎ.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ,




సంక్షేమం, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషన్ సభ్యురాలు కె.జి.వి. పద్మలత, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ హాస్టళ్లను పరిశీలించినట్లు ఛైర్మన్ తెలిపారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి ఆరోగ్యం, విద్య, భద్రత, పోషణ వంటి సదుపాయాలు అందేలా చూడాలని సూచించారు. పిల్లల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న ప్రజాధనం సక్రమంగా వినియోగమయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.

### బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి

గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలోని బాలల పరిరక్షణ కమిటీలు మరింత చురుకుగా పనిచేసేలా చూడాలని ఛైర్మన్ సూచించారు. సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, గ్రామ పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కూడిన కమిటీలు తమ పరిధిలోని బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీలు నెలకు కనీసం ఒకసారి సమావేశం కావాలని, ప్రతి నెల పాఠశాలలను తనిఖీ చేసి బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి కమిటీలు గ్రామ, వార్డు స్థాయి కమిటీల పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు.

### బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను అరికట్టాలి

14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండేలా చూడాలని, బాలలను పనుల్లో వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేయకుండా నిరోధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బాల్యవివాహాలను గుర్తించి అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు.

### పోక్సో కేసులు, టీనేజ్ గర్భధారణలపై అప్రమత్తత

సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలపై ప్రతికూల ప్రభావం పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసులు, టీనేజ్ గర్భధారణలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

### అంగన్‌వాడీలు, పాఠశాలల్లో వసతులు మెరుగుపరచాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు కనీసం ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డి ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలల్లో శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో గణితం, విజ్ఞానశాస్త్రంతో పాటు భాషా పాఠ్యాంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

### సంక్షేమ హాస్టళ్లలో భద్రతకు ప్రాధాన్యత

సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన సందర్భాల్లో రాత్రి వేళల్లో అక్కడే బస చేసి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు, సూచనలు తెలియజేసేందుకు ప్రతి హాస్టల్‌లో సలహాలు, ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### చిన్నారులను మాదకద్రవ్యాల సరఫరాకు వినియోగించకుండా చర్యలు

గంజాయి వంటి మాదకద్రవ్యాల సరఫరాకు కొంతమంది చిన్నారులను ఉపయోగిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని ఛైర్మన్ తెలిపారు. తెలియకుండానే చిన్నారులు నేరాల్లో చిక్కుకునే పరిస్థితులను అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో నేటి పిల్లలే భవిష్యత్ పౌరులని పేర్కొన్నారు. పిల్లలను ఆరోగ్యవంతులుగా, విద్యావంతులుగా, నైతిక విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఐసీడీఎస్ శాఖ పనితీరు గత ఆరు నెలల్లో గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. ఇంకా ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్యం, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా గుడ్ల నాణ్యత విషయంలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో అవగాహన కార్యక్రమాలతో పాటు విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పోలీస్, ఇతర శాఖలకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు నెలకు కనీసం ఒకసారి రాత్రి వేళల్లో హాస్టళ్లలో బస చేసి విద్యార్థులతో మాట్లాడాలని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేసే అవకాశం ఉంటుందని, హాస్టళ్లలో వాస్తవ పరిస్థితులను అధికారులు తెలుసుకోగలుగుతారని అన్నారు. బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, కమిషన్ సూచించిన అంశాల ఆధారంగా లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డీసీపీపీ విజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో ఉపయుక్తమైన భవన నిర్మాణ ప్రణాళిక రూపొందించాలి

**రూ.5.27 కోట్ల సీఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి ప్రణాళిక**

**విభాగాల పని ఒత్తిడికి అనుగుణంగా స్థల కేటాయింపు**

**భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందించాలి**

**నెల రోజుల్లో ఆసుపత్రి పారిశుధ్యం మెరుగుపడాలి: కలెక్టర్**



గుంటూరు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో చేపట్టనున్న భవన నిర్మాణానికి అన్ని విభాగాలకు ఉపయోగపడేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. రూ.5.27 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మంజూరైన భవన నిర్మాణ సమగ్ర ప్రణాళికపై గురువారం జీజీహెచ్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతన భవనంలో ఆయా విభాగాల్లో ఉన్న పని ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని స్థల కేటాయింపు అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. భవన నిర్మాణ నమూనాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సాధారణ వైద్యం, సాధారణ శస్త్రచికిత్స, ప్లాస్టిక్ శస్త్రచికిత్స, అత్యవసర గాయాల చికిత్సతో పాటు ఇతర విభాగాల అధిపతులు తమ విభాగాల అవసరాలను పక్కాగా రూపొందించి, భవనంలో అందుబాటులో ఉన్న విస్తీర్ణానికి అనుగుణంగా ప్రణాళికలను శనివారం నాటికి అందించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో భవనాన్ని విస్తరించే అవకాశాలను కూడా ప్రణాళికలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రాధాన్యత కలిగిన జీజీహెచ్‌కు మంచి పేరు వచ్చేలా వైద్యులు సమన్వయంతో పనిచేయాలని, వైద్యం కోసం వచ్చే రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ అన్నారు.



### ప్లాస్టిక్ శస్త్రచికిత్స వార్డు పనుల పరిశీలన

స్థానికంగా అందుబాటులో ఉన్న రూ.25 లక్షల నిధులతో చేపట్టిన ప్లాస్టిక్ శస్త్రచికిత్స వార్డు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భవనంలో ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా పనులు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. నిర్మాణ పనులు పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని స్పష్టం చేశారు.

### నెల రోజుల్లో పారిశుధ్యం మెరుగుపడాలి

జీజీహెచ్‌లో నెల రోజుల్లోగా పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా రోగుల రాకపోకలు అధికంగా ఉండే ఓపీ విభాగం, మరుగుదొడ్ల వద్ద పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో
# శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ





తిరుచానూరు,సెప్టెంబర్ 24,మహి న్యూస్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలలో భాగంగా గురువారం శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటిరోజు శ్రీ పద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఆలయం నుండి యాగశాలకు వేంచేపు చేశారు. ఉదయం 09.00 నుండి 11.30 గంటల వరకు ద్వారతోరణ ధ్వజకుంభ ఆవాహనం, చక్రాది మండలపూజ, చతుష్టానార్చన, అగ్నిప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం 03.00 నుండి 04.00 గంటల వరకు శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లతో, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో డా॥ శరత్ ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో శ్రీ దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, పలువురు అర్చకులు, సూపరింటెండెంట్ శ్రీ రమేష్, ముని చంగల్ రాయలు టెంపుల్ ఇన్స్పెక్టర్ల మునస్వామి, లక్ష్మీకాంత్, చలపతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 31వ సీఐఐ-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్య సదస్సు 2026 సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్




తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 24: అమరావతిలోని రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి 31వ సీఐఐ--ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్య సదస్సు--2026 సన్నద్ధత, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హెచ్ఓడీలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 31వ సీఐఐ--ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్య సదస్సు--2026ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాల వారీగా చేపడుతున్న సన్నాహకాలు, శాఖల మధ్య సమన్వయం, పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. అలాగే ఎస్ఐపీబీ ఆమోదించిన పారిశ్రామిక ప్రాజెక్టుల గ్రౌండింగ్ స్థితి, భూమి కేటాయింపు, అవసరమైన అనుమతులు, మౌలిక వసతుల కల్పన, ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. పీఎస్-2026 పెట్టుబడి ప్రతిపాదనల పురోగతి, ప్రాజెక్టుల స్థితిగతులు, అమలుకు తీసుకుంటున్న చర్యలు, పెండింగ్ అనుమతులు, పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కూడా ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు తీసుకుంటున్న చర్యలు, పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించడం, పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందించడం, పారిశ్రామిక ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. పెట్టుబడుల ప్రాజెక్టుల అమలులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారుల మధ్య సమన్వయం, శాంతిభద్రతలు, పెట్టుబడిదారులకు అవసరమైన ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు.

## ఈ నెల 28న రైల్వే కోడూరులో ఉద్యోగ మేళా
### పోస్టర్‌ను ఆవిష్కరించిన తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 24 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపిఎస్-ఎస్‌డిసి), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ మరియు సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన (సోమవారం) ఉదయం 8.30 గంటలకు రైల్వే కోడూరులోని శ్రీ సాయి డిగ్రీ మరియు పీజీ కాలేజీలో (సాయి నగర్) జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఐ.ఏ.ఎస్. గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తిరుపతి జిల్లా మరియు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 12 ప్రముఖ బహుళజాతి సంస్థలు పాల్గొని వివిధ విభాగాల్లో అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

### అర్హతలు - వయోపరిమితి:

విద్యా అర్హత: 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.

వయోపరిమితి: 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.

### దరఖాస్తు విధానం:

అభ్యర్థులు ముందుగా 'నైపుణ్యం' పోర్టల్ ద్వారా నమోదు చేసుకొని, 'బిల్డ్ యువర్ రెస్యూమే' విభాగం ద్వారా ప్రొఫైల్ పూర్తి చేసి, సంబంధిత కంపెనీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేరుగా వచ్చే అభ్యర్థుల కోసం వేదిక వద్ద స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రిజిస్ట్రేషన్ పోర్టల్: [https://naipunyam.ap.gov.in/] (https://naipunyam.ap.gov.in/)

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9052717078, 9988853335 (కాల్ సెంటర్)

ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఎల్డీఎం జి. రవికుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ఎన్‌టీఓ సునేష్ బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సులేమాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లరేవు ఎంపీపీ పాలకవర్గానికి ఘన సన్మానం
### ఐదేళ్లలో రూ.3 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 24: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ పాలకవర్గ పదవీకాలం పూర్తికావడంతో ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సత్కరించారు. తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాయుడు సునీతతో పాటు ఎంపీటీసీ సభ్యులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ప్రజాప్రతినిధులుగా తమ పదవీకాలంలో అందించిన సేవలను అభినందించారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ తన భర్త గంగాధర్ ప్రోత్సాహంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజల సహకారంతో ఐదేళ్లపాటు నిస్వార్థంగా సేవలు అందించామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. తన పదవీకాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధికి చేసిన కృషిని పలువురు నాయకులు అభినందించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి. వీరభద్రరావు, ఎంపీడీవో స్పర్జన్, నాయకులు కుడుపూడి శివనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, దూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## డిసెంబర్ 5 నుంచి 14 వరకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు
### భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలి: జేఈవో డా. ఎ. శరత్



తిరుచానూరు, సెప్టెంబర్ 24,మహి న్యూస్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో జేఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఈ ఏడాది గత ఏడాదితో పోలిస్తే 15 నుంచి 20 శాతం వరకు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

### అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జేఈవో ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలో చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. పంచమి తీర్థం రోజున భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని జేఈవో ఆదేశించారు. పంచమి తీర్థం రోజున భక్తుల కోసం పటిష్టమైన క్యూ లైన్లు, బ్యారికేడ్లు, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు 4 హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని ముఖ్యమైన ప్రవేశ పాయింట్ల వద్ద ఎల్ఈడీ స్క్రీన్లు, భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేలా సూచిక బోర్డులు, తిరుచానూరు, తిరుపతి ప్రాంతాల్లో అవసరమైన చోట్ల ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

### విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవాలి

బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టే విద్యుత్ అలంకరణలు భక్తులను ఆకట్టుకునేలా, ఆలయ పవిత్రతను ప్రతిబింబించేలా ఉండాలని జేఈవో సూచించారు. ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, మాడ వీధులు, భక్తుల రాకపోకలు జరిగే ప్రాంతాల్లో సంప్రదాయ ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలకు ప్రత్యేక కాన్సెప్ట్ రూపొందించి, అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### భక్తుల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం

భక్తుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య, వైద్య శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జేఈవో సూచించారు.

అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సిబ్బంది, మందులు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

### భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జేఈవో సూచించారు.

ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలు, క్యూ లైన్లు, మాడ వీధులు, ప్రధాన రహదారుల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

### సమన్వయంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించేలా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జేఈవో తెలిపారు. అమ్మవారి కృపతో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో టీటీడీ సీఈ మనోహరం, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, డీఎఫ్‌వో డి. ఫణికుమార్ నాయుడు, ఎస్ఈ వేంకటేశ్వర్లు, వీజీవో గిరిధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తల్లో స్ఫూర్తి...
# ఆంధ్రప్రదేశ్‌కు ఖ్యాతి తెచ్చేలా విశాఖ పెట్టుబడుల సదస్సు




అమరావతి, మహి న్యూస్, సెప్టెంబర్ 24: పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతిలో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని, ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పెట్టుబడి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చర్చలు నిర్వహించాలన్నారు. విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సన్నాహక కార్యక్రమాలపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. భాగస్వామ్య సదస్సు కేవలం ఎంవోయూల కోసం కాకుండా... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినింపేలా, ఏపీ బ్రాండింగ్ మరింత పెరిగేలా నిర్వహించాలన్నారు. అలాగే పెట్టుబడులతో పాటు... మిగిలిన అంశాలపైనా సదస్సులో చర్చ జరగాలన్నారు.

### ఎంట్రప్రెన్యూర్లను తీర్చిదిద్దేలా పాఠ్యాంశాలు

ప్రతీ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఎంఎస్ఎంఈ షోకేస్ పేరుతో ప్రోత్సాహం అందించాలని సీఎం సూచించారు. అలాగే, స్టార్టప్‌లకు పెట్టుబడులు పెట్టేవారి కోసం వినూత్నంగా షార్క్ ట్యాంక్ అనే విధానాన్ని ప్రవేశ పెట్టాలని సీఎం స్పష్టం చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను రీజినల్ కాన్ఫరెన్సులకు అనుసంధానం చేయాలన్నారు. భాగస్వామ్య సదస్సుకు ముందుగానే మరో 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు స్టార్టప్ ఆలోచనలు చేసేలా రీజినల్ సమ్మిట్ ఉండాలని, 7వ తరగతి నుంచే విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేలా ఎంట్రప్రెన్యూర్షిప్‌కు సంబంధించి పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలన్నారు. 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తే మరింతగా పెట్టుబడులను ఆకర్షించ వచ్చన్నారు.

### వేగంగా పెట్టుబడుల గ్రౌండింగ్

సమ్మిట్‌కు ముందు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడం, గతంలో కుదిరిన ఎంవోయూలను కన్వర్ట్ చేయడం, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులను గ్రౌండ్ చేయడం, రీజినల్ కాన్ఫరెన్సుల ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. అలాగే, ప్రస్తుత పెట్టుబడుల స్థితిగతులను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్టోబర్ చివరి నాటికి పెట్టుబడి ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలని..., కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో 75 శాతం గ్రౌండింగ్ చేసే లక్ష్యంతో శాఖలు పనిచేయాలని సీఎం నిర్దేశించారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.22.57 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయని చెప్పారు. కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 247 ప్రాజెక్టులు గ్రౌండింగ్ జరిగినట్టు తెలిపారు.

### రీజినల్ కాన్ఫరెన్స్‌ల షెడ్యూల్

అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 26 వరకు రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నారు. ముందుగా విశాఖపట్నంలో అక్టోబర్ 7న ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ -- ఫిన్ టెక్, సెమికండక్టర్స్, జీసీసీ, ఫార్మా, మెడ్ టెక్ ఫోకస్‌గా కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. అక్టోబర్ 12న కాకినాడలో మారిటైమ్, షిప్ బిల్డింగ్, కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రయార్టీ ఇవ్వనున్నారు. ఇక అక్టోబర్ 16న గుంటూరులో గవర్నెన్స్, క్యాపిటల్ సిటీ డెవలప్మెంట్, అర్బన్ ఇన్ఫ్రా, క్వాంటం వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పైన... అక్టోబర్ 23న అనంతపురంలో ఏరో స్పేస్, డిఫెన్స్, ఆటోమోటివ్, నేచురల్ ఫార్మింగ్, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, రిన్యువబుల్ ఎనర్జీ.... అక్టోబర్ 26న తిరుపతిలో టూరిజం, హాస్పటాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, సెమి కండక్టర్, అడ్వాన్స్ మెటీరియల్స్, ఆటోమోటివ్, స్పేస్, ఫుట్ వేర్ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రీజినల్ కాన్ఫరెన్సులు జరగున్నాయి. రీజినల్ కాన్ఫరెన్స్‌లోనే ఎంవోయూలు చేసుకునేలా ఈసారి మార్పులు చేశారు... ప్రధానమైన కొన్ని ప్రాజెక్టుల ఎంవోయూలు సమ్మిట్‌లో చేసుకోవాలని... వివిధ అంశాలపై చర్చలకు ప్రాధాన్యతనిచ్చేలా అలాగే విశాఖ సదస్సు చేపట్టాలని నిర్ణయించారు.

### దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలతో ప్రచారం



సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026కు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులను ఆకర్షించేందుకు ఇప్పటికే దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. దేశీయంగా చెన్నై, కోయంబత్తూరు, బెంగళూరు నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించగా, సెప్టెంబర్ 25న అహ్మదాబాద్, సెప్టెంబర్ 28న హైదరాబాద్, సెప్టెంబర్ 30న ముంబైలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయంగా సింగపూర్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, తైవాన్‌లలో రోడ్‌షోలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 29--అక్టోబర్ 1 మధ్య స్వీడన్‌లో, అక్టోబర్ 13--14 తేదీల్లో జపాన్‌లో, అక్టోబర్ 15--16 తేదీల్లో చైనాలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 11 మంది అంతర్జాతీయ మంత్రులు, 26 మంది అంతర్జాతీయ స్పీకర్లు, 21 దేశాల ప్రతినిధులు భాగస్వామ్య సదస్సుకు ఖరారయ్యారు. మరింత అంతర్జాతీయ, దేశీయ భాగస్వామ్యం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సింగపూర్, కంబోడియా, మయన్మార్, స్లోవాక్ రిపబ్లిక్, లిథువేనియా, బల్గేరియా, మారిషస్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, మొజాంబిక్ తదితర దేశాల నుంచి మంత్రులు, ప్రతినిధులు ఈసారి హాజరవుతున్నారు. ఈసారి 'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్షిప్' ప్రధాన థీమ్‌గా నిర్ణయించారు.

### అక్టోబర్ 8న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్

సమ్మిట్‌కు ముందు అక్టోబర్ 8న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. దౌత్యవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులు, మీడియా సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు విశాఖలోని కాపులుప్పాడలో నిర్మించ తలపెట్టిన కన్వెన్షన్ సెంటర్.... భవిష్యత్‌లో మిగిలిన అవసరాలకు వినియోగించుకునేలా ఉండాలని సీఎం అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరంలో కన్వెన్షన్ సెంటర్ గోదావరి పుష్కరాల కన్నా ముందే పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే అమరావతి, తిరుపతి, అనంతపురం కన్వెన్షన్ సెంటర్ల డిజైన్లు కూడా ప్రత్యేకంగా నిలిచేలా ఉండాలన్నారు.

# రైతు సాధికార సంస్థ- ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్



కుప్పం, మహి న్యూస్, సెప్టెంబర్, 24: బీడు భూములలో పీఎమ్‌డీఎస్ విత్తనాలు చల్లడం ద్వారా భూమిని ఖాళీగా ఉంచకుండా 365 రోజులు పచ్చని కవచం ఉండేలా చూడాలని రైతులకు డీపీఎం బాజీ బాబు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా, రామకుప్పం మండలం, పెద్దగానూరు గ్రామంలో రైతు గోవిందప్ప, జయరామిరెడ్డి పొలంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులతో కలిసి పీఎమ్‌డీఎస్ పద్ధతిలో 28 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి వెదజల్లే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పం డీపీఎం బాజీ బాబు పాల్గొన్నారు.

### ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడిన ముఖ్య అంశాలు:

1. విత్తన గుళికలు (సీడ్ బాల్స్): 20 నుంచి 32 రకాల విత్తనాలను విత్తన గుళికలుగా తయారుచేసి పొలంలో వేసుకోవాలి. దీనివల్ల విత్తనాలు చక్కగా మొలకెత్తి మంచి పంట లభిస్తుంది.

2. పశుగ్రాసం -- అధిక పాల దిగుబడి: ఈ పంటను 40 రోజుల తర్వాత (పూత దశలో) పశువులకు మేతగా వాడుకోవచ్చు. దీనివల్ల పాలలో వెన్న శాతం పెరిగి పాల దిగుబడి పెరుగుతుంది. ఫలితంగా లీటరుకు అదనంగా రూ.3 నుంచి రూ.5 వరకు ధర లభిస్తుంది.

3. భూసార పెంపు: పంట కోత అనంతరం మిగిలిన వేర్లను భూమిలో కలియదున్నడం వల్ల నేలలో కర్బన శాతం పెరిగి భూసారం గణనీయంగా వృద్ధి చెందుతుంది. తద్వారా ప్రధాన పంటకు పోషకాలు సమతుల్యంగా అంది, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడి వస్తుంది.

4. వర్షాభావ పరిస్థితులకు అనుకూలం: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో బీడు భూములలో పీఎమ్‌డీఎస్ విత్తనాలు వేసుకోవడం ఎంతో శ్రేయస్కరం.

5. నీటి వసతి ఉన్నచోట: రైతుకు అనుకూలమైన పంటలు, కూరగాయలు, పూలతోటలు సాగు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న మామిడి తోటలలో కూరగాయలు, పప్పుజాతి పంటలను అంతర పంటలుగా వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుంది.

6. నీటి వసతి లేనిచోట: నీటి లభ్యత లేని ప్రాంతాల్లో చిరుధాన్యాలు లేదా పీఎమ్‌డీఎస్ పంటలు వేసుకోవాలి.

7. 365 రోజుల పచ్చని కవచం: భూమి ఏడాది పొడవునా పంటలతో కప్పబడి ఉండటం వల్ల సూర్యరశ్మి నేలను నేరుగా తాకదు. దీనివల్ల భూతాపం తగ్గి, నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించకుండా అభివృద్ధి చెంది పంటలకు మేలు చేస్తాయి.

### రైతులకు విజ్ఞప్తి:

ఇటీవల వర్షాలు కురిసినందున ప్రతి రైతు తమ భూమిని ఖాళీగా ఉంచకుండా సేద్యానికి సిద్ధం చేసుకోవాలని డీపీఎం తెలిపారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు లేదా పీఎమ్‌డీఎస్ విత్తనాలను వేసుకోవడం వల్ల కనీస ఆదాయం లభించడంతో పాటు పశుగ్రాస కొరత తీరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్‌వైఎస్ఎస్ -- ఏపీసీఎన్ఎఫ్, డీపీఎమ్‌యూ, కుప్పం, చిత్తూరు జిల్లా.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

# సేలం రైల్వే స్టేషన్‌లో రక్షించబడిన బాలుడు

**కుటుంబ సభ్యుల గుర్తింపునకు సహకరించాలి**

**బాలుడి తల్లిదండ్రులు, సంరక్షకుల ఆచూకీ కోసం ప్రయత్నాలు**

**సమాచారం తెలిసిన వారు అధికారులకు తెలియజేయాలి**

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు**



కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): సేలం రైల్వే స్టేషన్‌లో రక్షించబడిన గుర్తుతెలియని బాలుడి తల్లిదండ్రులు లేదా సంరక్షకులను గుర్తించి, బాలుడిని కుటుంబంతో తిరిగి కలిపేందుకు ప్రజలు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి 19న సేలం రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద రైల్వే బాలల సహాయ బృందం బాలుడిని రక్షించింది. అనంతరం సేలం బాలల సంక్షేమ కమిటీ ఆదేశాల మేరకు డాన్ బాస్కో అన్బు ఇల్లం సంరక్షణలో బాలుడిని ఉంచారు. బాలుడు చెవిటితనంతో పాటు మాట్లాడలేని స్థితిలో ఉన్నాడని, రెండు చేతులను మోచేతుల దిగువ భాగంలో కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. సాధారణ సమాచార మార్పిడి విధానాల ద్వారా మాట్లాడటం, రాయడం లేదా తన వ్యక్తిగత వివరాలను తెలియజేయడం బాలుడికి సాధ్యం కావడం లేదు. నిపుణుల సహాయం అందించినప్పటికీ ఇప్పటివరకు బాలుడి పేరు, కుటుంబ నేపథ్యం, స్వస్థలం తదితర వివరాలను గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్రంలోని సంబంధిత జిల్లా అధికారులను బాలుడి వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరింది. తమిళనాడు రాష్ట్రంలోని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాలుడి తల్లిదండ్రులు లేదా సంరక్షకులను గుర్తించి, కుటుంబంతో తిరిగి కలిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. కర్నూలు జిల్లా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, బాలల సంక్షేమ రంగంలో పనిచేస్తున్న సంస్థలు బాలుడి కుటుంబ సభ్యుల గుర్తింపునకు తమవంతు సహకారం అందించాలని కమిషన్ కోరింది. బాలుడికి సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసిన వారు వెంటనే సమీపంలోని బాలల సంరక్షణ అధికారులు లేదా బాలల సంక్షేమ కమిటీకి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఈవీఎంల భద్రతపై పటిష్ట నిఘా ఉండాలి

**నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలి**

**గోదాము వద్ద నిరంతరం నిఘా కొనసాగించాలి**

**సీసీటీవీ పర్యవేక్షణను పటిష్టం చేయాలి**

**ప్రవేశ, నిష్క్రమణ రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని, పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాములో ఈవీఎంల భద్రతకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, ప్రవేశం--నిష్క్రమణ రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలపై ఎన్నికల విభాగం అధికారులు, భద్రతా సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, భారతీయ జనతా పార్టీ తరపున సాయి ప్రదీప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున శ్రావణ్ కుమార్, బహుజన్ సమాజ్ పార్టీ తరపున అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఏపీడీపీఎంఎస్ హెల్ప్‌డెస్క్ ప్రారంభం

**భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ మరింత వేగవంతం**

**నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభించిన కమిషనర్ చల్లా ఓబులేసు**

**భవన యజమానులు, దరఖాస్తుదారులు, ఆర్కిటెక్ట్‌లు, ఎల్‌టీపీలకు సేవలు**

**డీపీఎంఎస్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సహాయ కేంద్రం**




కర్నూలు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏపీడీపీఎంఎస్ హెల్ప్‌డెస్క్‌ను గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ప్రారంభించారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. భవన యజమానులు, దరఖాస్తుదారులు, ఆర్కిటెక్ట్‌లు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీలు) డీపీఎంఎస్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం హెల్ప్‌డెస్క్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, అనుమతులకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా హెల్ప్‌డెస్క్ ద్వారా అవసరమైన సహాయాన్ని అందిస్తామని పేర్కొన్నారు. భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎదురయ్యే సాంకేతిక, ప్రక్రియాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు హెల్ప్‌డెస్క్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీసీపీ శబ్నం శాస్త్రి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో మాబు సుభాని గార్మి వేడుకలు

**విద్యుత్ దీపాలతో అలంకరించిన దర్గా**

**జెండా లెక్కించి స్వామి వారికీ కాయ, కర్పూరాలను అందిస్తున్న భక్తాదులు, ప్రజలు.**

**భక్తుల కోరికలను తీరుస్తున్న మహాబుసుభాని స్వామి**



ఓర్వకల్ సెప్టెంబర్ 24, (మహి న్యూస్): కర్నూలు జిల్లా ఓర్వకల్ మండల కేంద్రంలోని తోట గేరి లో వెలసిన మాబు సుభాని దర్గాలో గార్మి ఉత్సవాన్ని వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా దర్గాలో జెండాలు ఎక్కించి కార్యకర్తలను అందించి ఫాతిహా చేశారు. అనంతరం గ్రామ ప్రజల భక్తాదుల, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్లప్పుడు రైతులు గ్రామ ప్రజలు భక్తులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ స్వామి వారిని కోరుకున్నారు. అంతేకాకుండా మహిళలకు కుర్చీలాట, పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రతి ఏటా యధావిధిగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షఫీ అల్లా షాఖద్రి, కరీముల్లా షాఖద్రి, రిజ్వాన్ అల్లా షాఖద్రి,మొల్ల మహబూబ్ బాషా, హసన్ భాష, చిన్న మహబూబ్ బాషా, హుస్సేన్, ఇంతియాజ్, ఎం.రఫీ, మహబూబ్ హుస్సేన్, కట్టుబడి మహబూబ్ సాహెబ్, రఫీ బాయ్, జావీద్, ప్రవీణ్, సునీల్, భక్తాదులు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు

# ఎఫ్‌పీఓల బలోపేతంతో రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు

**సమష్టి వ్యవస్థతో వ్యవసాయ వ్యయాలు తగ్గించాలి**

**ఎఫ్‌పీఓల ద్వారా వ్యవసాయ యంత్రీకరణకు ప్రోత్సాహం**

**పంటల సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌పై దృష్టి**

**రైతుల ఉత్పత్తులకు సొంత బ్రాండ్ ఏర్పాటు చేయాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): రైతులు సమష్టిగా ఏర్పడి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) కీలకంగా ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కేంద్ర ప్రాయోజిత రైతు ఉత్పత్తిదారుల సంస్థల పథకంపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఎఫ్‌పీఓల పురోగతి, రైతుల సమీకరణ, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. రైతులు వ్యక్తిగతంగా ఎదుర్కొనే సమస్యలకు సమష్టి వ్యవస్థ ద్వారా పరిష్కారాలు చూపడంలో ఎఫ్‌పీఓలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు కేవలం పంటల ఉత్పత్తికే పరిమితం కాకుండా ఎఫ్‌పీఓల ద్వారా ఎరువుల దుకాణాలు, వ్యవసాయ యంత్ర పరికరాల అద్దె కేంద్రాలు, పంటల సేకరణ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలను చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు వ్యక్తిగతంగా ట్రాక్టర్, ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలను కొనుగోలు చేయడం ఆర్థికంగా భారమవుతుందని కలెక్టర్ తెలిపారు. అదే పరికరాలను ఎఫ్‌పీఓ ద్వారా రైతులందరూ సమష్టిగా సమకూర్చుకుని వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఎక్కువ మంది రైతులకు యంత్రీకరణ ప్రయోజనాలు అందుతాయని వివరించారు.

## రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు

సమావేశానికి హాజరైన సుమారు 14 మంది ఎఫ్‌పీఓ ప్రతినిధుల నుంచి వారి కార్యకలాపాలు, వ్యాపార ప్రణాళికలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సహకారం అవసరమైన అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌పీఓలు స్వయంగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అవసరమైన సహకారంపై సంబంధిత అధికారులతో చర్చించారు. రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు రవాణా వాహనాలు, మిరప ప్రాసెసింగ్ యూనిట్లు, కూరగాయల శీతల గిడ్డంగులు, సేకరణ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూమి తదితర అంశాలను ఎఫ్‌పీఓ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఆయా అవసరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాలు, వివిధ శాఖల సమన్వయంతో సాధ్యమైనంత మేరకు సహకారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా ఎఫ్‌పీఓల ద్వారా పంటల సేకరణ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేపట్టాలని సూచించారు. రైతులను మరింతగా ఎఫ్‌పీఓల్లో భాగస్వాములను చేసి, వారి ఉత్పత్తులకు సొంత బ్రాండ్ ఏర్పాటు చేసి మార్కెట్లో విక్రయించేలా సాంకేతిక, మార్కెటింగ్, ఆర్థిక



సహకారం అందించాలని అధికారులకు సూచించారు. రైతులకు వారి పంటలకు మెరుగైన ధరలు లభించడంతో పాటు ఎఫ్‌పీఓలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొత్త ఎఫ్‌పీఓల సంఖ్యను పెంచడంతో పాటు ఇప్పటికే ఉన్న సంస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎఫ్‌పీఓల బలోపేతానికి అవసరమైన ప్రభుత్వ సహకారం, బ్యాంకు రుణాలు, మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ రాజశేఖర్, నాబార్డ్ సహాయ జనరల్ మేనేజర్ రామ సుబ్బారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 15లోగా పీఎం సూర్య ఘర్ పనులు పూర్తి చేయాలి

**లబ్ధిదారుల ఇళ్లపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలి**

**పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి**

**బ్యాంకు రుణాల కోసం 600 దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి**

**సబ్‌స్టేషన్ల ఏర్పాటులో జాప్యం చేయొద్దు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధిదారుల ఇళ్లపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు పనులను అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, విక్రేతలను



ఆదేశించారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు, సబ్‌స్టేషన్ల ఏర్పాటుపై గురువారం కలెక్టర్ తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పథకాల అమలుపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద నమోదు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పరిధిలో ఉన్న లక్ష్యాలు, అందుబాటులోకి వచ్చిన సామగ్రి, ఇప్పటివరకు సాధించిన ప్రగతిని కలెక్టర్ విడివిడిగా సమీక్షించారు. నిర్ణీత గడువు అక్టోబర్ 15లోగా అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులు, విక్రేతలను ఆదేశించారు. ప్రతిరోజూ చేపడుతున్న పనులు, వివిధ పథకాల పురోగతిని నిర్దేశిత నమూనాలో విడివిడిగా సమర్పించాలని సూచించారు. పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం వహించరాదని విక్రేతలను హెచ్చరించారు.

## 600 రుణ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

బ్యాంకు రుణాల కోసం పరిశీలనలో ఉన్న 804 దరఖాస్తుల్లో కనీసం 600 దరఖాస్తులను వెంటనే పరిష్కరించి పంపాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ మోహన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే ఉన్న లక్ష్యాలతో పాటు ఈ 600 దరఖాస్తులకు సంబంధించిన పనులను కూడా ప్రారంభించాలని విద్యుత్ శాఖ అధికారులు, విక్రేతలకు సూచించారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రైవేటు ఇళ్లకు కూడా పీఎం సూర్య ఘర్ పథకం కింద కొత్త దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మూడు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లకు స్థలాలు

కర్నూలు నగరంలో పెరుగుతున్న విద్యుత్ లోడ్ అవసరాలను అధిగమించేందుకు సంతోష్‌నగర్, గణేష్‌నగర్, కలెక్టరేట్ ప్రాంగణంలో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు 25 సెంట్ల చొప్పున స్థలాలు కేటాయించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ప్రదీప్ కుమార్ కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో సౌర విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ సంస్థకు తక్కువ సమయంలోనే స్థలాలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. నిర్దేశించిన గడువు ప్రకారం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో పనులను పూర్తి చేసి, నెలవారీగా సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ప్రదీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సురేష్, పురుషోత్తం, విజయభాస్కర్, డిప్యూటీ ఇంజినీర్లు సుబ్బన్న, నాగ ప్రసాద్, చంద్రన్న, లీడ్ బ్యాంక్ మేనేజర్ మోహన్, సౌర విద్యుత్ విక్రేతలు పాల్గొన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, విక్రేతలు వీడియో సమావేశం ద్వారా పాల్గొన్నారు.

# 629 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ రిహార్సల్స్

**సెప్టెంబర్ 26న ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో ప్రధాన పరేడ్**

**కవాతును పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, కమాండెంట్ దీపికా పాటిల్**

**శిక్షణలో ప్రతిభ కనబరిచిన ట్రైనీలకు అవార్డులు, ప్రశంసా పత్రాలు**

**ముఖ్య అతిథులుగా మంత్రి టీజీ భరత్, డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**




కర్నూలు, సెప్టెంబర్ 24: (మహి న్యూస్): కర్నూలు నగరంలోని ఏపీఎస్పీ 2వ బెటాలియన్ పరేడ్ మైదానంలో 2025--26 బ్యాచ్‌కు చెందిన 629 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ రిహార్సల్స్ గురువారం నిర్వహించారు. సెప్టెంబర్ 26న జరగనున్న ప్రధాన పాసింగ్ ఔట్ పరేడ్‌కు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా ఈ రిహార్సల్స్ నిర్వహించారు. ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో శిక్షణ పొందిన 430 మంది, కర్నూలు పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 199 మంది కలిపి మొత్తం 629 మంది ట్రైనీ కానిస్టేబుళ్లు ప్రధాన పరేడ్‌లో పాల్గొననున్నారు. రిహార్సల్స్‌కు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ హాజరై ట్రైనీ పోలీసుల కవాతును పరిశీలించారు. సెప్టెంబర్ 26న జరగనున్న ప్రధాన పాసింగ్ ఔట్ పరేడ్‌ను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ట్రైనీ పోలీసులకు అవసరమైన సూచనలు, దిశానిర్దేశం చేశారు.







## ప్రతిభ కనబరిచిన ట్రైనీలకు అవార్డులు

శిక్షణ కాలంలో ప్రతిభ కనబరిచిన ట్రైనీ కానిస్టేబుళ్లకు ఎస్పీ విక్రాంత్ పాటిల్, బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ట్రైనీలకు శిక్షణ



అందించడంలో విశేష సేవలు అందించిన శిక్షకులు, పోలీసు అధికారులను కూడా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

## ప్రధాన వేడుకకు ప్రముఖులు

సెప్టెంబర్ 26న ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో జరగనున్న ప్రధాన పాసింగ్ ఔట్ పరేడ్‌కు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, అదనపు కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు వెంకటరమణ, బాషా, వెంకటశివుడు, డీటీసీ వైస్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, డీఎస్పీలు ఓబులేసు, సుధాకర్ రెడ్డి, సీఐలు విక్రమసింహ, శేషయ్య, తేజామూర్తి, శ్రీధర్, మన్సురుద్దీన్, వెంకటకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు

### సెప్టెంబర్ 27న బ్యాంకులు సాధారణ పనివేళల్లో పనిచేసేలా చర్యలు

కడప, సెప్టెంబర్ 24, (మహి న్యూస్) యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. జనార్ధన్ సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సెప్టెంబర్ 27 ఆదివారం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణ పనివేళల్లో పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతితో బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం అనుసంధాన శాఖలు, నగదు నిల్వ కేంద్రాలు కూడా ఆ రోజు పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 26 నాలుగో శనివారం సెలవు కాగా, సెప్టెంబర్ 27న బ్యాంకులు పనిచేయనున్నందున ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు సమ్మె కారణంగా బ్యాంకుల ప్రత్యక్ష సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున ముఖ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా వ్యాపార కొనసాగింపు ప్రణాళికను అమలు చేయాలని బ్యాంకులకు సూచించినట్లు తెలిపారు.

### సెప్టెంబర్ 25లోగా లావాదేవీలు పూర్తి చేసుకోవాలి

జిల్లా ప్రజలు అత్యవసర బ్యాంకింగ్ లావాదేవీలను సెప్టెంబర్ 25లోగా పూర్తి చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. జనార్ధన్ సూచించారు. ముఖ్యంగా నగదు ఉపసంహరణలు, నగదు జమ, చెక్కుల లావాదేవీలు, రుణ వాయిదాల చెల్లింపులు, ప్రభుత్వ చెల్లింపులు, ఇతర ముఖ్యమైన లావాదేవీలను చివరి నిమిషం వరకు వాయిదా వేయకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలని కోరారు. అత్యవసర అవసరాల కోసం ఏటీఎంలు, నగదు జమ–ఉపసంహరణ యంత్రాలు, యూపీఐ, అంతర్జాల బ్యాంకింగ్, ఇతర డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు సాధ్యమైనంత వరకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు చర్యలు చేపట్టి ఖాతాదారులకు సహకరించాలని ఆయన కోరారు.

## రాజంపేట సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రం పరిశీలన

### ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కడప, సెప్టెంబర్ 24, (మహి న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజంపేట సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనల మేరకు సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయ సహాయ కేంద్రం ప్రాధాన్యతను వివరించారు. జైలులోని ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాది వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా న్యాయ సేవల సహాయవాణి 15100పై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే రాజంపేట మండల న్యాయ సేవా సమితి లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, న్యాయ సహాయ స్వచ్ఛంద కార్యకర్తలు, ఖైదీలు పాల్గొన్నారు.




## ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యం-పోషకతకు ప్రాధాన్యం

### కె.ఎఫ్.డబ్ల్యూ. జర్మనీ బృందంతో భవిష్యత్ కార్యాచరణపై చర్చ




అమరావతి/కడప మహి న్యూస్ సెప్టెంబర్ 24: ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యం, పోషకాహారానికి ప్రాధాన్యత కల్పించేందుకు భవిష్యత్ కార్యాచరణపై కె.ఎఫ్.డబ్ల్యూ. జర్మనీ ప్రతినిధి బృందంతో రాష్ట్ర అధికారులు చర్చించారు. రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయ విధానాలు, రైతులకు అందుతున్న ప్రయోజనాలు, ఆరోగ్యం--పోషకాహార రంగంలో తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. కె.ఎఫ్.డబ్ల్యూ. జర్మనీకి చెందిన ప్రతినిధి బృందం రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించి, రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేసింది. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, పోషకాహారం, ఆహార నాణ్యతను మెరుగుపరిచే అవకాశాలపై చర్చ జరిగింది. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, పోషకాహారమైన ఆహార వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు రైతు సంక్షేమం మధ్య ఉన్న అనుసంధానాన్ని వివరించారు. వ్యవసాయాన్ని పంట ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఆరోగ్యం, పోషణ, ఆర్థికాభివృద్ధితో అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. అనంతరం ప్రతినిధి బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి, రైతుల అనుభవాలు, ప్రకృతి వ్యవసాయ విధానాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకుంది. భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు అవసరమైన సహకారంపై చర్చించారు.








## హౌస్‌కీపింగ్, భద్రతా సేవలకు టెండర్ల ఆహ్వానం

### ఆసక్తి, అనుభవం కలిగిన అర్హతగల సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు

మదనపల్లె, సెప్టెంబర్ 24, (మహి న్యూస్): అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో హౌస్‌కీపింగ్, భద్రతా సేవలను నిర్వహించేందుకు అర్హత, అనుభవం కలిగిన వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీల నుంచి టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు టెండర్ విధానంలో సేవలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. టెండర్ నిబంధనల ప్రకారం అవసరమైన సిబ్బంది, పరికరాలు, సామగ్రి, ఇతర ఏర్పాట్లను టెండర్ పొందిన సంస్థ తమ స్వంత బాధ్యత, వ్యయంతో సమకూర్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. హౌస్‌కీపింగ్ సేవల్లో కార్యాలయ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ప్రాంగణ నిర్వహణ తదితర పనులు, భద్రతా సేవల్లో కార్యాలయ రక్షణ, ప్రవేశ--నిష్క్రమణ నియంత్రణతో పాటు నిర్దేశిత భద్రతా విధులను నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి కలిగిన అర్హతగల సంస్థలు, ఏజెన్సీలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమ టెండర్ దరఖాస్తులను జిల్లా కలెక్టర్ కార్యాలయం, అన్నమయ్య జిల్లా, మదనపల్లెలో సమర్పించవచ్చని తెలిపారు. టెండర్ల పరిశీలన, తదుపరి ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఏ టెండర్‌నైనా కారణం చూపకుండా అంగీకరించే లేదా తిరస్కరించే అధికారం జిల్లా పరిపాలనకు ఉంటుందని స్పష్టం చేశారు. టెండర్‌కు సంబంధించిన నిబంధనలు, అర్హతలు, ఇతర వివరాల కోసం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం, మదనపల్లెను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టిగా సిద్ధం కావాలి

### ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి: భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/జమ్మలమడుగు, సెప్టెంబర్ 24, (మహి న్యూస్): జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న నాయకులు, కార్యకర్తలతో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి స్థానంలో పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వ్యాప్తికి అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

### ఎలక్టోరల్ రోల్ ప్రక్రియను పారదర్శకంగా, విశ్వసనీయంగా పూర్తి చేయాలి
### పెండింగ్ దరఖాస్తులు, ఫొటోలు, పత్రాలను మరోసారి పరిశీలించాలి



మదనపల్లె, సెప్టెంబర్ 24,(మహి న్యూస్): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ--2026లో భాగంగా జిల్లాలో చేపట్టిన ఎలక్టోరల్ రోల్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు కె.వి.ఎన్. చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా



కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎలక్టోరల్ రోల్ ప్రక్రియపై ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఇంటింటి పరిశీలన, పోలింగ్ కేంద్రాల పునర్విభజన, ముసాయిదా ఓటర్ల జాబితా, అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులు వివరించారు. జూలై 31 నాటికి జిల్లాలోని 1,424 పోలింగ్ కేంద్రాల పరిధిలో 10,83,736 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో పురుషులు 5,33,064 మంది, మహిళలు 5,50,578 మంది, ఇతర లింగానికి చెందిన వారు 94 మంది ఉన్నట్లు వివరించారు. జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు చక్రధర్ బాబు మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా తుది జాబితాను రూపొందించేందుకు మిగిలిన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పెండింగ్ దరఖాస్తులు, ఫొటోలు, సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన దరఖాస్తులను మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఒకే ఇంటి నంబరులో పది కంటే ఎక్కువ ఓట్లు నమోదై ఉంటే వాటిని తప్పనిసరిగా మరోసారి పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల తిరస్కరణలో నిబంధనలను పాటించాలని, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు--జనాభా నిష్పత్తిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దివ్యాంగులు, ఇతర లింగానికి చెందిన ఓటర్ల వివరాలను కూడా క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశాల వివరాల్లో సంబంధితుల సంతకాలు ఉండేలా చూడాలని సూచించారు. సమావేశాల్లో పాల్గొన్న ఓటర్లు, ఇతర సంబంధిత వ్యక్తుల సంతకాలను కూడా మినిట్స్‌లో నమోదు చేయాలని తెలిపారు. దీనివల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై మరింత విశ్వసనీయత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ చివరి దశలో ఎలాంటి లోపాలకు అవకాశం లేకుండా ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చక్రధర్ బాబు సూచించారు. పరిశీలకుడు ఇచ్చిన సూచనలను సమర్థవంతంగా అమలు చేసి, నిబంధనల ప్రకారం తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటేష్, నియోజకవర్గ ఈఆర్‌ఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## సర్ -2026 ప్రక్రియపై రాజకీయ పార్టీల సంతృప్తి

### పెండింగ్ అంశాలను గడువులోగా పూర్తి చేయాలి
### బూత్ స్థాయి నుంచి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి



మదనపల్లె, సెప్టెంబర్ 24, (మహి న్యూస్): అన్నమయ్య జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ--2026పై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారని, తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలిపారు. మదనపల్లె కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



ఆధ్వర్యంలో జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు కె.వి.ఎన్. చక్రధర్ బాబు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ, దరఖాస్తుల పరిశీలన, ఓటర్ల చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై గతంలో తమకు ఉన్న పలు సందేహాలు, అపోహలు ప్రస్తుతం నివృత్తి అయ్యాయని తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు కె.వి.ఎన్. చక్రధర్ బాబు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు బూత్ స్థాయి అధికారులను తప్పనిసరిగా నియమించుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ఓటర్లకు మెరుగైన సేవలు అందించడంతో పాటు తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించగలుగుతామని తెలిపారు. దావాలు, అభ్యంతరాల పరిష్కారంలో రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మిగిలి ఉన్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత సమావేశాల్లో గుర్తించిన అంశాలతో పాటు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పెండింగ్ దరఖాస్తులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మిగిలిన పనులను రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చివరి దశలో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం లేకుండా ప్రతి కేసు, ప్రతి దరఖాస్తు, సంబంధిత రికార్డులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్యక్తం చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతకు ప్రాధాన్యతనిస్తూ మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటేష్, నియోజకవర్గ ఓటర్ల జాబితా నమోదు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు మెరుగైన వసతులు, అవకాశాలు కల్పించాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
### యూత్ హాస్టల్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 24: యువతకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, వారిని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. యూత్ హాస్టల్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో హాస్టల్ నిర్వహణ కమిటీ (హెచ్‌ఎంసీ), జిల్లా సలహా కమిటీ (డీఏసీ) సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూత్ హాస్టల్ పునరుద్ధరణ, అదనపు నిధుల సమీకరణ, విద్యుత్ రాయితీ, వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణ కార్యక్రమం, విద్యాసంస్థల్లో మై భారత్ విభాగాల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కడప యూత్ హాస్టల్ పునరుద్ధరణకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ రూ.80.46 లక్షలు మంజూరు చేసిందని ప్రాధాన్యత, ప్రణాళిక ప్రకారం.. సంబందిత నిధులను ఖర్చు చేయాల్సి ఉందని అధికారులకు సూచించారు. రోడ్లు, భవనాల శాఖ రూపొందించిన అంచనాల ప్రకారం పనులకు అవసరమైన అదనపు నిధులపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైన అదనపు నిధులను సమకూర్చేందుకు వివిధ మార్గాలను పరిశీలించాలని, సంస్థల సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకారం పొందే అవకాశాలను కూడా చూడాలని కలెక్టర్ సూచించారు. యూత్ హాస్టల్ పునరుద్ధరణ పనులను దగ్గరుండి పర్యవేక్షించేలా నోడల్ అధికారిని నియమించాలని, పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. యూత్ హాస్టల్‌కు ప్రస్తుతం సాధారణ కేటగిరీలో విద్యుత్ బిల్లులు వస్తున్న నేపథ్యంలో రాయితీ విద్యుత్ పొందే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ బకాయిలపై కూడా సంబంధిత అధికారులతో చర్చించి తగిన పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. యువతలో ప్రతిభను వెలికితీసి, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ క్విజ్ కార్యక్రమంపై కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 30లోగా యువత నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలు, విద్యాసంస్థల్లో మై భారత్ విభాగాలు లేదా స్వచ్ఛంద సేవా విభాగాలను ఏర్పాటు చేసి, ప్రతి సంస్థకు సమన్వయ అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం ఆయా యూనివర్శిటీలు, కళాశాలలు, విద్యాసంస్థల అధిపతులకు జిల్లా యంత్రాంగం తరఫున లేఖలు పంపాలని సూచించారు. యువతను స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు దేశ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేసి, జిల్లాలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించి ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారి దీపక్ జేమ్స్, జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, ఎల్డిఎం జనార్దనం, ఆర్ అండ్ బి ఎస్.ఈ. చంద్రశేఖర్, స్టెప్ సీఈవో రమేష్, సంబంధిత కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com